## దుర్గామాత, హన్‌మాన్ విగ్రహాల ప్రతిష్ఠాపన

అందోల్, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో బుధవారం హన్‌మాన్, దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభం, హోమం, యజ్ఞాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పలు గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీ పీ బాలయ్య, ఎంపీటీసీ కృష్ణాగౌడ్, మాజీ సర్పంచ్, గుడి నిర్మాణ దాత చందులతావీర్‌మల్లప్ప, నాయకులు పాల్గొన్నారు.


అందోల్: నేరడిగుంటలో పూజలు చేస్తున్న మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

## విద్యుత్ కోతలతో రైతన్నల అవస్థలు


మక్త అల్లూర్‌లో విద్యుత్ కోతలతో నీరందక ఎండిపోతున్న మొక్కజొన్న పంట

కంది, ఫిబ్రవరి 21: విద్యుత్ కోతలతో రైతన్నలు అవస్థలు పడుతున్నారు. 2014కు ముందు రోజులు మళ్లీ చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కంది మండలంలో సుమారు 3500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న తదితర పంటలను రైతులు సాగుచేశారు. బోరు బావులపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతన్నలకు విద్యుత్ కోతలు నరకం చూపిస్తున్నాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంటల తరబడి విద్యుత్ నిలిపివేయడంతో పంటలు కండ్లముందే ఎండిపోతున్నాయి. మొక్కజొన్న పంటలు ఎదుగుదల లేక ఎండు మొఖం పట్టాయి. కేసీఆర్ ప్రభుత్వంలో కరెంట్ కోతలనే మరిచిపోయామని, పుష్కలంగా నీటితో పంటలు బాగా పండాయని రైతన్నలు గుర్తు చేసుకుంటున్నారు. రైతు పెట్టుబడి సాయం చేసి అండగా నిలిచిన దేవుడు కేసీఆర్ అని యాది చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌లో పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రైతుకు దక్కేలా లేవు. విద్యుత్ కోతలను నివారించి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

## బడంపేట ఆలయ కమిటీ నియామకం

కోహీర్, ఫిబ్రవరి 21: మండలంలోని దిగ్వాల్ గ్రామంలో బుధవారం బడంపేట రాచన్నస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు కోసం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బడంపేట దయానంద్ పాటిల్, సభ్యులుగా స్వరూప, శ్రీపాల్, గోపాల్, మాచిరెడ్డిపల్లి జగదీశ్వర్ స్వామి, నాగిరెడ్డిపల్లి అంజయ్య, బిలాల్‌పూర్ అశోక్, సిద్దాపూర్ తండా భీమ్‌సింగ్, పర్సపల్లి ప్రభాకర్, గురుజువాడ బస్వరాజ్, కోహీర్ నాగేశ్, దిగ్వాల్ చంద్రప్ప, ఖానాపూర్ కొత్తూర్ యాదయ్య, మనియార్‌పల్లి మున్నూర్ రాజు, మద్రిమహేశ్‌ను ప్రతిపాదించారు. మార్చి 14 నుంచి 16వరకు నిర్వహించే రాచన్నస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీతో త్వరలో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి పాల్గొన్నారు.


బడంపేట రాచన్నస్వామి ఆలయ కమిటీ నియామకానికి సమావేశమైన నాయకులు

## యువకుడికి దేహశుద్ధి

సంగారెడ్డి, ఫిబ్రవరి 21: పిల్లలను అపహరించేందుకు వచ్చినట్లు అపోహపడి అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని కాలనీవాసులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. బుధవారం పట్టణంలోని బైపాస్ రోడ్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సమీపంలోని ఒక ఇంటిలో బాలుడిని బయటికి రావాలని పిలుస్తుండగా గమనించిన బాలుడి తల్లి కాలనీవాసులకు సమాచారం ఇచ్చారు. కాలనీవాసులు చేరుకుని బాలుడిని ఎందుకు పిలుస్తున్నావని అడుగ్గా యువకుడు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పిల్లల్ని ఎత్తుకుపోయే వాడని అనుమానంతో విద్యుత్ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పట్టుబడిన యువకుడు జార్ఖండ్ రాష్ట్ర వాసిగా గుర్తించామని, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 21: వినియోగదారులకు ఉత్తమసేవలు అందించేందుకు కెనరా బ్యాంకు కృషి చేస్తుందని నిజామాబాద్ రీజనల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని మల్‌చల్మా గ్రామంలో నూతనంగా నిర్మించిన బ్యాంకు భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. వినియోగదారులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు.

కార్యక్రమంలో సంగారెడ్డి లీడ్ బ్యాంకు మేనేజరు గోపాల్‌రెడ్డి, జహీరాబాద్ కెనరా బ్యాంకు చీఫ్ మేనేజరు భీమా రాఘవేందర్, మల్‌చల్మా బ్యాంకు మేనేజరు అరవింద్ రావు, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, వినియోగదారులు పాల్గొన్నారు.

## వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు

జిన్నారం, ఫిబ్రవరి 21: ఖాజీపల్లి గ్రామంలోని గొల్లగూడెంలో మల్లన్న జాతర వైభవంగా జరిగింది. రెండు రోజులపాటు జరిగిన జాతరలో స్వామి వారి కల్యాణోత్సవం, బోనాలు, నాగవెల్లి కార్యక్రమాలను ఒగ్గు కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఫలహారం బండి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శంకర్‌యాదవ్, మాజీ సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, నాయకులు గద్దె నర్సింహ, రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఆకుల నవీన్‌కుమార్, ఆంజనేయులు, అరికెల మహేశ్, ఆకుల కిరణ్‌కుమార్, నరేశ్, వరుణ్ పాల్గొన్నారు.


ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి

## కార్మికుడికి అండగా బీఆర్‌ఎస్ నాయకుడు

బొల్లారం, ఫిబ్రవరి 21: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తున్న వలస కార్మికుడు ప్రమాదానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కార్మికుడి పరిస్థితిని పరిశ్రమ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కృష్ణారెడ్డిని ఆశ్రయించారు. బుధవారం యాజమాన్యంతో మాట్లాడి కార్మికుడిని ఆదుకోవాలని కోరారు. కార్మికుడి దయనీయ పరిస్థితికి చలించిన ఆనంద్‌కృష్ణారెడ్డి రూ. 9వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.


స్టాళ్లను సందర్శించి పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి


సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి చేతిపై రంగోలి వేస్తున్న విద్యార్థినీ

# మహిళలు వ్యాపారంలో రాణించాలి

- ఆదాయంతోనే ఆత్మవిశ్వాసం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఆకట్టుకున్న విపణి స్టాళ్ల ప్రదర్శన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: ఆదాయంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, మహిళలు వ్యాపారంలో రాణించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విపణి (సంత) కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసి ఏర్పాటు చేసిన 50 స్టాళ్లను సందర్శించి, వాటిని ఎలా తయారు చేశారని ఆరాతీశారు. వాటికి ఎంత ఖర్చు అయిందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన రుచికరమైన పలు వంటకాలను కలెక్టర్ రుచిచూసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన గోలి సోడ, పలు వంటకాలను కొనుగోలు చేశారు. తన చేతిపై విద్యార్థినితో రంగోలి వేయించుకున్నారు.


విద్యార్థులు నిర్వహించిన ఆటలో గెలిచి, పెన్నును సొంతం చేసుకున్న కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. వ్యాపార నైపుణ్యాభివృద్ధిని సాధించి పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కష్టపడితే ఫలితం ఎలా ఉంటుందో అనుభవం ద్వారా తెలుస్తుందన్నారు. తయా రు చేసిన వంటకాలు, వస్తువులకు వచ్చిన లాభంతోపాటు వాటి తయారీ కోసం వెచ్చించిన ఖర్చును కూడా లెక్కించుకోవాలని హితవు పలికారు. తన ఐఏఎస్ శిక్షణలోనూ ఇలాంటి స్టాళ్ల ప్రదర్శనలో పాల్గొన్నని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విపణిలో భాగంగా స్టాళ్లను సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఆటలో పాల్గొని వారిని ఉత్సాహపర్చారు.

ఎర్ర లారీలు, నల్ల లారీలు అనే వాక్యాన్ని తప్పులు లేకుండా పలుమార్లు తిరిగి చెప్పిన ఆటలో కలెక్టర్ గెలుపొంది పెన్నును బహుమతిగా అందుకున్నారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకర్శించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణబాయి, సీపీడీసీ కమిటీ సభ్యుడు డాక్టర్ కూన వేణు, తారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్, అధ్యాపకులు హ్యూమెరా సయీద్, అశోక్, నవ్య, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

# 'నమస్తే తెలంగాణ' చెప్పిందే నిజమైంది!

- జహీరాబాద్ డివిజన్‌లో దాదాపు అన్ని శాఖల అధికారుల బదిలీ
- 'హస్తం' మార్కు అధికారులను నియమించిన అధికార పార్టీ

జహీరాబాద్, ఫిబ్రవరి 21: జహీరాబాద్ డివిజన్‌లో అధికారులను బదిలీ చేసేందుకు అధికార పార్టీ కసరత్తు చేస్తుందని 'నమస్తే తెలంగాణ' పత్రికలో ఫిబ్రవరి 1న 'బదిలీలకు కసరత్తు' అనేవార్త ప్రచురితమైంది. జహీరాబాద్ డివిజన్‌లోని పోలీసు, రెవెన్యూ, రవాణా, పీఆర్, మున్సిపల్, ఎక్సైజ్ శాఖ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కొత్త అధికారులు వివిధ శాఖల్లో బాధ్యతలు స్వీకరించారు. 'నమస్తే తెలంగాణ' చెప్పినట్లు అధికార పార్టీ నాయకులు 'హస్తం' మార్కు అధికారులను తీసుకొచ్చారు. జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారిగా వెంకారెడ్డి పనిచేయగా ప్రభుత్వం శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేసింది. కొత్తగా హుజూరాబాద్‌లో పనిచేస్తున్న ఆర్డీవో రాజు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ డీఎస్పీగా పనిచేసిన రఘును హైదరాబాద్‌లోని ప్రధాన పోలీసు కార్యాలయానికి బదిలీ చేసి, హైదరాబాద్ నుంచి డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి(నిమ్జ్) ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న రాధాబాయి, మహిపాల్‌రెడ్డిలను బదిలీ చేసి కొత్తగా నాగలక్ష్మి, వసంతకుమారిలకు బాధ్యతలు అప్పగించారు. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సుభాష్‌రావు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసికి బదిలీ కా గా, సదాశివపేటలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వచ్చారు. జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలుగా పనిచేసిన రాజు, వెంకటేశాన్ని హైదరాబాద్‌కు బదిలీ చేయగా, హైదరాబాద్‌లో ఉన్న రవి, నవీన్‌కుమార్‌లను కొత్తగా నియమించారు. జహీరాబాద్ ఎక్సైజ్ సీఐగా పనిచేసిన అశోకుమార్‌ను నారాయణపేటకు బదిలీ చేసి, శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి రాఘవేందర్‌రావును బదిలీ చేశారు. జహీరాబాద్ వీఎంఐగా పనిచేస్తున్న జయప్రకాశ్‌రెడ్డిని సూర్యాపేటకు బదిలీ చేసి, హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో పనిచేస్తున్న సురేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో పనిచేస్తున్న ము గ్గురు ఎంవీఐలను బదిలీచేసి కొత్త వారికి బాధ్యతలు అప్పగించారు.


బదిలీలకు కసరత్తు!

జహీరాబాద్ పట్టణ ఎస్ఐగా పని చేసిన శ్రీకాంత్‌ను పుల్కల్‌కు బదిలీ చేసి కొత్తగా లక్ష్మారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. పలు శాఖల్లో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. అధికారుల బదిలీలు జరుగుతాయని నమస్తే తెలంగాణ ముందే చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21: ఆర్సీపురం డివిజన్‌లోని సాయిజ్యోతి నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. బుధవారం సాయిజ్యోతి నగర్‌లో ఆమె జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. పదేండ్ల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్‌లతో చాలా ఇబ్బంది పడుతున్నామని, నూతన డ్రైనేజీ పైప్‌లైన్ వేసి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపడుతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ జనార్దన్, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పెంటయ్య, సత్తయ్యగౌడ్, భూపాల్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.


డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

## ఓటరు నమోదుపై అవగాహన

సంగారెడ్డి, ఫిబ్రవరి 21: ఓటరు నమోదుపై 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తామని ఆర్డీవో రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు నాయకులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అన్ని ఇంజినీరింగ్, మెడికల్, బీఎడ్, డిగ్రీ కళాశాలల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఇందుకు రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు దేవిదాస్, ఎస్తేర్ అనిత, విజయలక్ష్మి, సరస్వతి, డీఏవో శాంతకుమారి, మున్సిపల్ మేనేజర్ విజయలక్ష్మి, ఆర్ఐ సూర్యప్రకాశ్, సీనియర్ సహాయకులు మల్లేశ్‌తోపాటు రాజకీయ పార్టీల నాయకులు తాహెర్ పాషా, పరశురాం నాయక్, పన్యాల వజీర్ బేగ్, మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృభాష అభివృద్ధికి కృషి చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 21: మాతృభాష అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాషల్లో కాలానుగుణంగా వస్తున్న మార్పులను వివరిస్తూ అనువాద ఆవశ్యకతను తెలియజేశారు. మాతృభాషలో పట్టుసాధిస్తూ ఇతర భాషా, సంస్కృతులను తెలుసుకోవాలన్నారు. తెలుగు విభాగాధిపతి రాపోలు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలియజేసే నినాదాలు, మాతృభాష అభివృద్ధి, భాషా పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేశారు. డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ తెలుగు భాష చరిత్ర, ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశం, వ్యాఖ్యాత డాక్టర్ సుమతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్

## అమీన్‌పూర్‌లో సమ్మక్క సారలక్క ఉత్సవాలు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 21: అమీన్‌పూర్‌లో సమ్మక్క సారలక్క ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి జోగిని శ్యామల ఆధ్వర్యంలో పోతరాజుల విన్యాసాలు, వివిధ కళాకారుల ఆటపాటలతో ఊరేగింపుగా అమ్మవార్లకు బోనం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో చైర్మన్ పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నీలం భిక్షపతి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నర్సింహగౌడ్, కౌన్సిలర్లు కల్పనాఉపేందర్‌రెడ్డి, కవితా శ్రీనివాస్ రెడ్డి, బాసెట్టి కృష్ణ, ప్రమోద్‌రెడ్డి, గోపాల్, మాధవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.


అమ్మవార్లకు పూజలు చేస్తున్న చైర్మన్ పాండురంగారెడ్డి, కుటుంబసభ్యులు

## విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 21: విద్యార్థినులు మానసికంగా దృఢంగా ఉండి, చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలని సైకాలజిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల మానసికస్థితిపై అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో పిల్లలు మానసికంగా మనోధైర్యంతో భయపడకుండా బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని అనుకున్న లక్ష్యాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆర్సీవో భీమయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ లలితమ్మ, కరస్పాండెంట్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలి

### ఎస్పీ బాలస్వామి

సంగారెడ్డి, ఫిబ్రవరి 21: పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలని, క్రమశిక్షణతో శిక్షణ పూర్తిచేయాలని ఎస్పీ బాలస్వామి అన్నారు. బుధవారం కంది మండలం చిద్రుప్ప శివారులో ఉన్న పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసు శిక్షణను ప్రారంభించారు. శిక్షణలో పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన 232 మంది 9నెలలపాటు శిక్షణలో ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, మీరందరూ క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకుని డీటీసీ సంగారెడ్డికి మంచిపేరు తీసుకురావాలన్నారు. శిక్షణతో శరీరదారుఢ్యంతోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ బోధిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఆర్ఐ శ్రీనివాస్, లాక్లాస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఎస్ఐలు, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు కానిస్టేబుల్స్ శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

## ఎర్రరాయి తవ్వితే కఠిన చర్యలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 21: అక్రమంగా ఎర్రరాయి తవ్వితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ భానుకిరణ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గణేశ్‌పూర్ శివారులో అనుమతి లేకుండా ఎర్రరాయి తవ్వకాలు చేపడుతుండడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఇటాచి, టిప్పర్లను స్వాధీనం చేసుకుని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా రాయి తవ్వకాలు చేపట్టినందుకు రూ. 5వేల జరిమానాను విధించారు. హద్నూర్, న్యామతాబాద్, మల్కన్‌పాడ్, రేజింతల్ తదితర గ్రామాల్లో అనుమతి లేకుండా ఎర్రరాయి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఉర్సులో భక్తుల సందడి

న్యాల్‌కల్, ఫిబ్రవరి 21: న్యాల్‌కల్ శివారులోని ఉర్సే షరీఫ్ పీర్ సాహెబ్ ఉర్సుకు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యాల్‌కల్ మండల జడ్పీటీసీ స్వప్నాభాస్కర్ దంపతులు దర్గాను సందర్శించి దట్టి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సులో పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


దట్టిని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జడ్పీటీసీ స్వప్నాభాస్కర్ దంపతులు

## బావిలోపడి యువకుడు మృతి

జహీరాబాద్, ఫిబ్రవరి 21: మద్యం మత్తులో వ్యవసాయ బావిలోపడి యువకుడు మృతి చెందాడని చెరాగ్‌పల్లి హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ తెలిపారు. బుధవారం మొగుడంపల్లికి చెందిన రాజు(25) మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని తెలిపారు. జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా ప్రమాదస్థలానికి అగ్నిమాపక అధికారి ప్రశాంత్ సిబ్బందితో చేరుకొని బావిలో పడిన యువకుడిని కాపాడేందుకు ప్రయత్నం చేశారన్నారు. యువకుడి మృతి చెందడంతో మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది జి.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూనూస్ బయటకు తీశారన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## విద్యుత్ అంతరాయం

గుమ్మడిదల, ఫిబ్రవరి 21: మండలంలోని బొంతపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బొంతపల్లి ఏఈ రవీందర్ తెలిపారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఎంవీఐ, ఏఎంవీఐల బదిలీ

సంగారెడ్డి, ఫిబ్రవరి 21: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వ అధికారులను ఎన్నికల కమిషన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జా రీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల జిల్లా రవాణా శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎంవీఐ(మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు), మరో ఇద్దరు ఏఎంవీఐ(అదనపు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు)లను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సంగారెడ్డి రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐలుగా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్, కృష్ణవేణి హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు బదిలీ అయ్యారు. మరో ఇద్దరు ఏఎంవీఐలు ఆదిత్య, ప్రవీణలను కోదాడ, మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణ చెక్‌పోస్టుకు బదిలీ చేశారు. వీరిస్థానంలో ఇప్పటివరకు హైదరాబాద్ కార్యాలయం నుంచి ఎంవీఐ అరుణ ఈ నెల 19న బాధ్యతలు చేపట్టారు. మిగతావారు త్వరలో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

## బీఆర్‌వీకేఎస్ జెన్కో రాష్ట్ర సహాయకార్యదర్శిగా శ్రీనివాస్

పుల్కల్, ఫిబ్రవరి 21: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మికసంఘం సహాయకార్యదర్శిగా సింగూరు జల విద్యుత్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బీఆర్‌వీకేఎస్ జెన్కో అసిస్టెంట్ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, మినీ హైడల్ స్టేషన్స్ పోచంపాడు చీఫ్ ఇంజినీర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల హక్కుల కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

చౌటకూర్, ఫిబ్రవరి 21 : విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలుగుఫోరం సంగారెడ్డి జిల్లా కమి టీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష ది నోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగి న కార్యక్రమానికి డీఈవో వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు సమా ఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణకృష్ణ, సభ్యులు నాగభూషణం, శ్రవణ్, రవికుమార్, సత్తయ్య, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, సురేశ్‌గౌడ్, జయశంకర్ పాల్గొన్నారు.